ప్రజాశక్తి
బుధవారం 19 జూన్ 2024
5
శ్రీకాకుళం

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిలో రాష్ట్రవ్యాప్తంగా 7,300 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.ముత్యాలరావు, బి.కుమార్ నాయక్, కోశాధికారి పి.సుధీర్ కోరారు. గత ఐదేళ్ల కాలంలో అటు కార్పొరేషన్, ఇటు ప్రభుత్వ యాజమాన్యంలోనూ తమ సమస్యలు పట్టించుకోలేదని పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వ్యవస్థ వల్ల దళారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కాంటాక్టు వ్యవస్థను రద్దు చేసి, ఆర్‌టిసి ద్వారా నేరుగా వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గత విధానాలకు స్వస్తి చెప్పండి

- వైసిపి హయాంలో ప్రభుత్వ శాఖలు నిర్వీర్యం
- తప్పుడు నిర్ణయాల్లో కలెక్టర్ ప్రమేయం ఉన్నా చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమైపోయాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో చాలా దౌర్భాగ్యమైన పరిస్థితిని చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. పాత విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. కక్షసాధింపులు, ఇబ్బందులు లేకుండా అందరితో కలిసి జిల్లాను ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. తప్పుడు నిర్ణయాల్లో కలెక్టర్ ప్రమేయమున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పారిశుధ్య పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో బుధవారం నుంచి వారం రోజులు తప్పనిసరిగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతామని... వీటికోసం రైతులు ఇబ్బందులు పడినట్లు పత్రికల్లో కథనాలు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క, పూడికను తొలగించి, శివారు భూములకు సాగునీరందేలా చూడాలని వంశధార అధికారులను ఆదేశించారు. షట్టర్లను మూయించి వంశధార నీటిని ఈ ఏడాది తొలుత శివారు భూములకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, నిధుల్లేవని కథలు చెప్పొద్దని చెప్పారు. ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం వస్తున్న నేపథ్యంలో వరి నుంచి ఆ పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు.

సిఎంతో సమీకృత కలెక్టరేట్ ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం వచ్చిన నిధులనూ గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదని విమర్శించారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద కనీసం ఒక్క స్ప్రింకర్‌నూ ఇవ్వలేదని చెప్పారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ప్రారంభిస్తామన్నారు.

డిఎస్‌డిఒపై ఆగ్రహం

కోడి రామ్మూర్తి స్టేడియానికి సంబంధించి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా స్టేడియానికి వస్తున్న బాలికలు, మహిళలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు తాను చొరవ చూపినా డిఎస్‌డిఒ శ్రీధర్ అడ్డుకున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల వల్ల జనానికి మంచి జరుగుతుంటే, అనుమతుల్లేవన్న పేరుతో అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. 'నువ్వు ఒక అన్‌ఫిట్. నీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లావాడివని నిన్ను ఇక్కడకు తీసుకొస్తే చేసే పని ఇదా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన శాఖల అధికారులూ దీన్ని ఒక హెచ్చరికగా తీసుకోవాలన్నారు.

వ్యక్తిగత అజెండాను పక్కన పెట్టాలి : కేంద్రమంత్రి

గతంలో కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో కొంత నిరాశ ఉండేదని, రాబోయే రోజుల్లో కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ సహకారం అందుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న మంత్రివర్గ సహచరులతో ఉన్న సంబంధాలతో రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అధికారులు, ఉద్యోగులు వ్యక్తిగత అజెండాలను పక్కన పెట్టి, జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించడానికి సహకరించాలన్నారు. ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని, వారి నుంచి ఒక్క ఫిర్యాదు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు సామాన్యులు వెళ్లినప్పుడు పడే ఇబ్బందులేమిటో తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఒక మ్యుటేషన్ కోసం తానే స్వయంగా రణస్థలం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తే, 20 రోజులు చేయకుండా ఇబ్బంది పెట్టారని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వం వస్తే మంచి జరుగుతుందని ప్రజలు ఉంచిన నమ్మకానికి అనుగుణంగా అంతా బాధ్యతతో పనిచేయాలన్నారు. పలువురు ఎమ్మెల్యేలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ నవీన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో కొత్త మోసం

- పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఎస్‌బిఐ యోనో రివార్డ్స్ పేరిట వాట్సాప్‌కు లింకులు
- క్లిక్ చేస్తే ఖాతాలో డబ్బులు మాయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న బ్యాంకు అధికారులు



డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారు సైతం స్మార్ట్‌ఫోన్‌లో లావాదేవీలు చేసే రోజులు వచ్చేశాయి. యుపిఐ యాప్స్ అందుబాటులోకి రావడం, అందరూ స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తుండడంతో ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్థిక నేరాలు సైతం పెరుగుతున్నాయి. ముఖ్యంగా రకరకాల లింక్‌లను పంపుతూ వినియోగదారుల ఖాతాల్లోని డబ్బులను కాజేస్తున్నారు కేటుగాళ్లు. ఎప్పటికప్పుడు కొంగొత్త మార్గంలో బురిడీ కొట్టిస్తున్నారు.

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

తాజాగా ఎస్‌బిఐ రివార్డ్స్ పేరిట ఒక మోసం వెలుగులోకి వచ్చింది. ఎస్‌బిఐ రివార్డ్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌ల్లో కొన్ని మెసేజ్‌లు వస్తున్నాయి. ఇందుకోసం సైబర్ నేరగాళ్లు ఏకంగా వాట్సాప్‌ను హ్యాక్ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్స్‌లో తెలిసిన వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వస్తుండడంతో వెనకా ముందు చూడకుండా లింక్‌లను క్లిక్ చేసి, ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. ఎస్‌బిఐ రివార్డ్స్ పేరుతో లింక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మెసేజ్‌లో 'మీ ఎస్‌బీఐ రివార్డు రూ.7,250 యాక్టివేట్ అయింది. అది ఈ రోజుతో ముగిసిపోతుంది. డబ్బులు పొందేందుకు ఎస్‌బిఐ రివార్డ్స్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి, తద్వారా మీ ఖాతాలో డబ్బులు జమ చేసుకోండి' అన్నది దాని సారాంశం. దీంతోపాటు ఎస్‌బిఐ యోనో పేరుతో ఓ లింక్‌ను యాడ్ చేసి పంపిస్తున్నారు. ఈ లింక్‌ను క్లిక్ చేయగానే.. ప్రొఫైల్ ఫొటో, పేరు ఎస్‌బిఐగా మారిపోతున్నాయి. కాంటాక్ట్ డీటెయిల్స్ కూడా ఎస్‌బిఐ హెల్ప్‌లైన్ అంటూ వస్తుండడంతో ఎస్‌బిఐ అధికారికంగా పంపిన మెసేజ్‌గానే భావిస్తున్నారు. వారి ప్రమేయం లేకుండానే వారి వాట్సాప్ నుంచి ఇదే మెసేజ్ మరిన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లోకి ఫార్వర్డ్ అవుతున్నాయి. దీంతో కొందరు ఈ లింక్‌ను క్లిక్ చేసి డబ్బులు కోల్పోతున్నారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. రివార్డ్స్ పాయింట్ పేరుతో వచ్చే మెసేజ్‌లను గుడ్డిగా నమ్మకూడదని చెప్పున్నారు. బ్యాంకు నుంచి అటువంటి లింకులు రావని, అధికారిక వెబ్‌సైట్ గానీ యాప్‌లోకి వెళ్లి గానీ నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

పద్మ అవార్డులకు నామినేషన్ల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : భారత మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్, 2025 సంవత్సరానికి గానూ పద్మ అవార్డులకు అర్హులైన వారి నుంచి నామినేషన్లను అహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులకు కళలు, సామాజిక, సాంఘిక సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్, ఇండస్ట్రీ, వైద్యం, పాండిత్యం, విద్య, సివిల్ సర్వీసెస్, క్రీడలు, ఆధ్యాత్మికం, యోగా, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కంజర్వేషన్, క్యూలనరీ, వ్యవసాయం, గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల పదో తేదీ లోపు https://awards.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న ప్రతులను కలెక్టరేట్ ఆవరణలోని సెట్‌శ్రీ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయ పర్యవేక్షకులు ఎల్.ఎల్ నాయుడు ఫోన్ నంబరు 9182908248 సంప్రదించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

రైతులకు ప్రభుత్వ పథకాలు తోడ్పాటు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ పథకాలు రైతులకు తోడ్పాటునందిస్తాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత ప్రసార కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విజ్ఞానం గ్రామాలకు చేరాలన్నారు. పరిశోధన ఫలితాలు, సమాచారం రైతులకు అందాలని, అప్పుడే వ్యవసాయం మరింత వృద్ధి చెందుతుందని చెప్పారు. వ్యవసాయ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని గ్రామాల్లోని రైతుల అనుభవానికి జోడించాలని, తద్వారా ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఆత్మ పీడీ ఎ.రామచంద్రరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ చిట్టిబాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పైడి వెంకటరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 65.36 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 65.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షకు రాసేందుకు 7,742 మంది పరీక్ష ఫీజులు చెల్లించారు. వారిలో 7,431 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 311మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 4,857 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2,574 మంది ఫెయిల్ అయ్యారు.

యాజమాన్యం	కళాశాలలు	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
ప్రైవేటు	76	4,324	2,777	64.22
మోడల్‌స్కూల్స్	13	299	208	69.57
కెజిబివి	22	154	109	70.78
హైస్కూల్ ప్లస్	2	11	9	81.82
ప్రభుత్వ కళాశాలలు	38	2,309	1,546	66.95
కోపరేటివ్ కాలేజ్‌లు	2	168	89	52.98
గిరిజన సంక్షేమం	1	56	39	69.64
సాంఘిక సంక్షేమం	9	110	80	72.73
మొత్తం	**163**	**7,431**	**4,857**	**65.36**

జిజిహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ వైద్య కళాశాల అనుబంధంగా ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జిజిహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ దాసరి షకీల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రిమ్స్ వైద్య కళాశాలలో ఫిజియాలజీ డిపార్టుమెంట్‌లో హెచ్‌ఒడిగా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీనియర్ వైద్యురాలిగా ఉన్న ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటివరకు తాత్కాలిక సూపరింటెండెంట్‌గా బాధ్యతల్లో ఉన్న డాక్టర్ డి.పార్వతి గైనకాలజీ విభాగం హెచ్‌ఒడిగా తిరిగి బాధ్యతల్లో కొనసాగనున్నారు.

మధ్యవర్తిత్వంతో మేలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారులకు మేలు చేకూరుతుందని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్టు కమిటీ మధ్యవర్తిత్వ భావన, సాంకేతికతలపై 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కోర్టుల కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కోర్టుల నుంచి ఎంపిక చేసిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మధ్యవర్తిత్వానికే ప్రాధాన్యత ఉంటుందని అభిప్రాయపడ్డారు. పార్టీల మధ్య న్యాయమూర్తులకు ఎక్కువ సమయం కేటాయించే అవకాశం ఉండదన్నారు. శిక్షణ తీసుకున్న మధ్యవర్తిత్వ న్యాయవాదికి కక్షిదారుల పూర్తి సమాచారాన్ని తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని చెప్పారు. కక్షిదారులను విడివిడిగా మధ్యవర్తిత్వం చేయడం వల్ల పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షులు జి.సువర్ణరాజు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జి.శశీదేవి, సీనియర్ ట్రైనర్ సుదర్శన సుందర్, ఉమ్మడి జిల్లాలోని కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట కోర్టు పరిధిలోని లీగల్ సర్వీసెస్ కమిటీల చైర్మన్లు, న్యాయవాద మధ్యవర్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అధికారులను ఆదేశించారు. తద్వారా వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పలాస డివిజన్ పరిధిలోని ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంశధార శివారు భూములకు సాగునీరందేలా చూడాలన్నారు. ఇరిగేషన్, వంశధార కాలువల్లో పూడికతీతలు, మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలన్నారు. హుదూద్, టిడ్కో గృహాలు ఎలా ఉన్నాయో పరిశీలించి వాటి మరమ్మతులకు ఎంత వ్యయం అవుతుందో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పలాస తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్ నాయుడు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, పలు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

నిమిషాల్లో ముగిసిన మండల సమావేశం

(6లో)

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

ఎంహెచ్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉద్యోగులు

ఎంహెచ్ జీవితం అనుసరణీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు మోటూరు హనుమంతరావు జీవితం అనుసరణీయమని ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎ.సోమశేఖర్ అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు అధ్యక్షతన ఎంహెచ్ 23వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. తొలుత ఎంహెచ్ చిత్రపటానికి సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదకునిగా, ఉద్యమకారునిగా, రాజకీయవేత్తగా, మేధావిగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఎంహెచ్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. ప్రజాప్రతినిధిగా, సంపాదకునిగా ఏకకాలంలో రెండింటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని చెప్పారు. ప్రజాశక్తి పత్రికకు పునాది వేసి నిలదొక్కుకునేందుకు ఎంహెచ్ చేసిన తెగువను సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజాశక్తి సంపాదక బాధ్యతల్లోనూ మోటూరు విశేష కృషి చేసి సవ్యసాచి అనిపించుకున్నారని తెలిపారు. మోటూరు ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సభకు యాడ్స్ జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు ఆహ్వానం పలకగా, స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు వందన సమర్పణ చేశారు. సభలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భావనపాడులో వలలు దగ్ధం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడులో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు గొరకుల ఆదినారాయణకు చెందిన రెండు వలలను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. దీనిపై ఆయన నౌపడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీని విలువ రూ.12 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. వేట విరామ సమయంలో కొద్ది రోజులుగా హార్బర్‌లో ఎప్పుడూ దాచుకున్న చోటే వలలు ఉంచానని, మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి వలలు దగ్ధమై ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ఉత్సవాలు జరుగుతున్నందున ప్రమాదవశాత్తు ఇది జరిగిందా..?, ఎవరైనా ఉద్దేశపూర్వకంగానే చేశారా? అన్నది తెలియడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

కాలిపోయిన వలలు చూపిస్తున్న ఆదినారాయణ

పత్రికా ప్రకటన

పాస్ పోర్టు పోయినది. శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, బారువ కొత్తూరు గ్రామానికి చెందిన పిట్ట చలపతి S/o హేమరాజు చెందిన పాస్ పోర్టు నంబర్ X5969955 జిరాక్స్ కొరకు బారువకొత్తూరు నుంచి బారువ వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల పిట్ట చలపతి కు గానీ బారువ పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

Cell : 9502040860

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తా
వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
తెలుగుదేశం పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత మొదటి సారి స్థానిక ఎన్‌టిఆర్ భవనానికి మంగళవారం వచ్చారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ఓటువేసి గెలిపించారని, గెలిపించిన ప్రజలకు ఏదోఒక రూపంలో వారికి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, చిన్నసాన ఎంపిటిసి సంబారి రాజశేఖర్, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

కేకును కట్ చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస
వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ కౌన్సిల్ కార్యాలయంలో అధ్యక్షులు కణితి విజయలక్ష్మి అధ్యక్షతన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై తొలి సంతకం చేయడంపై సిఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది పైడి వరాహనరసింహం మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని న్యాయవాదులు నిరసన తెలియజేసినా, గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని విద్యాసాగర్, సీపాన గోవిందరావు, బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు, అన్నెపు సత్యం, బూర్జె సీతారాం పాల్గొన్నారు.

పిఎం కిసాన్ నిధులు విడుదల

ప్రజాశక్తి- మెళియాపుట్టి
ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు పిఎం కిసాన్ నిధులు విడుదలయ్యాయని మండల ఎఒ దానకర్తుడు తెలిపారు. వారణాసిలో పిఎం నరేంద్ర మోడీ 17వ విడత పిఎం కిసాన్ నిధులు విడుదల చేశారని అన్నారు. పిఎం కిసాన్ నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతు భరోసా కేంద్రం ద్వారా మంగళవారం చూపించామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, బసవ పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

నిమిషాల్లో ముగిసిన మండల సమావేశం

- సమస్యలపై స్పందించని సభ్యులు
- గైర్హాజరైన అధికారులు

ప్రజాశక్తి- బూర్జ
మండల సమస్యలపై చర్చించాల్సిన మండల సమావేశం నిమిషాల వ్యవధిలోనే ముగిసింది. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన సభ్యులు మిన్నకుండడంతో సాదాసీదాగా సమావేశం ముగిసింది. ముఖ్యంగా అందుబాటులో ఉండాల్సిన అధికారులు గైర్హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కర్నెన దీప అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం నుంచీ సభ్యులు ప్రజా సమస్యలపై నోరు విప్పపోవడం గమనార్హం. 11 గంటల 8 నిమిషాలకు సమావేశం ప్రారంభించి 12 గంటలకు ముగించారు. అటు టిడిపి చెందిన సభ్యులు కూడా ప్రజా సమస్యలపై స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. తుడ్డలి సర్పంచ్ ప్రతినిధి అంపిలి గణపతిరావు మాట్లాడుతూ ఉపాధి కూలీల నుంచి సిబ్బంది రూ.వంద నుంచి రూ.200 వరకు వారానికి వసూలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎపిఒ రాజ్‌కుమార్ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుత్తావల్లి సర్పంచ్ ప్రతినిధి హనుమంతు గోవిందరాజులు మాట్లాడుతూ మండల సమావేశానికి అధికారులు మైక గాని, బేనర్ గాని ఏర్పాటు చేయకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో సాగునీరు అందిస్తారని, కాలువలను మరమ్మతులకు చేపడతామని ప్రకటించిన అధికారులు... మండల సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పోలీస్‌శాఖ, ఫిషరీ, ఐసిడిఎస్, హౌసింగ్, ఉద్యానవన శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్‌పిటిసి బెల్లపుకొండ రామారావు, మండల ప్రత్యేకాహ్వానితులు కర్నెన నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, ఎంపిడిఒ రవీంద్రబాబు, మండల ఎఒ వి.రాజేశ్వరరావు, వైద్యాధికారులు రాజశేఖర్, రమ్యశ్రీ, వెలుగు ఎపిఎం బాబూరావు, విద్యుత్‌శాఖ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఎన్.వి.కె.నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి దీప

వాలంటీర్ల జీవితాలతో ఆటలా?

వాలంటీర్ల జీవితాలతో ఆటలాడుకోవడం ఎంతవరకు సమంజసమని, తమకు న్యాయం చేయడంలో జాప్యం ఎందుకని నాయకులను, అధికారులను ప్రశ్నించారు. మండల కేంద్రంలో 16 మంది వాలంటీర్లు తక్కువ వేతనంతో శక్తి వంచన లేకుండా పనిచేశామని అన్నారు. కరోనా సమయంలో సేవలందించామన్నారు. ఎన్నిక సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు వాలంటీర్లను రాజీనామా చేయాలని బలవంతం చేశారని తెలిపారు. దీంతో మూడు నెలల పాటు జీతం అందలేదని, దీంతో ఆర్థికంగా నష్టపోయామని వాపోయారు. తమ ఉద్యోగాలకు తమకు ఇప్పించాలలని ఎంపిడిఒ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.

నాటుసారా, బైకును స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కంచిలి
మండలంలోని కత్తివరం జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో కత్తివరానికి చెందిన మద్దిల ప్రసాద్‌ను 300 నాటు సారా ప్యాకెట్లతో అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ జె.భీమ్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై నాటుసారా ప్యాకెట్లను తరలిస్తున్న సమాచారం రావడంతో దాడులు చేసి పట్టుకున్నామని అన్నారు. అతని నుంచి నాటు సారా ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటు సారా, అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో పలాస టాస్క్‌ఫోర్స్ సిఐ రామచంద్రకుమార్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, అప్పలరాజు, భాను, నాయుడు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సంఘ నాయకులు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- టెక్కలి
పట్టుశాలి సంక్షేమ సంఘానికి చెందిన మల్లిపెద్ది ప్రణవ్‌సాయి తెలంగాణ ఎంసెట్‌లో 60వ ర్యాంకు, ఎపిఇ సెట్‌లో 12వ ర్యాంకు, ఆల్ ఇండియా స్థాయి నీట్‌లో 114వ ర్యాంకు సాధించారు. ఈ మేరకు పట్టుశాలి సంఘం నాయకులు మంగళవారం ప్రణవ్‌సాయికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అదేవిధంగా తల్లిదండ్రులను మలిపెద్ది మధు దంపతులనూ సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు మలిపెద్ది మధు, కార్యదర్శి దుంప శ్రీనివాస్, సంఘ నిర్వాహకులు ఆట్ల పార్వతీశం, దున్న సాంబశివరావు, విశ్వేశ్వరరావు, కె.అచ్యుతరావు, కాపల రఘునాథ్, మాడుగుల మహేష్, దుంప మురళీమోహనరావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

శిరీషకు అభినందనలు

పలాస : ఎమ్మెల్యే గౌతు శిరీషకు అధికారులు అభినందించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో డిటి నౌపడ భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది ఉన్నారు.

బూర్జ : పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ
మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ, ఉప సర్పంచ్ దుప్పాడ వెంకట అప్పలనాయుడులు స్టూడెంట్ కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.గజలక్ష్మి, కడగల కృష్ణ, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.
ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని ఐదో వార్డు పరిధిలోని అక్కివలస ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టిడిపి నాయకులు తంగి గురయ్య పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. అలాగే సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, కిల్లి శేషు, వెంకట అప్పలనాయుడులు కూడా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన రామ్మోహన్


లోకేష్‌తో రామ్మోహన్

పొందూరు: రాష్ట్ర హెచ్‌ఆర్‌డి, ఐటి ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, ఆర్‌టిజి మంత్రి నారా లోకేష్‌ను అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్ మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్రమంత్రిని కలిసిన ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎపి రెవెన్యూ సర్వీసుల సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకుని దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, జనరల్ సెక్రటరీ ఎస్.వి.రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, అసోసియేట్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్‌చక్రవర్తి, పి.సింహాచలం, మురళీధర్‌నాయక్, కె.ప్రవల్లిక ప్రియ, డి.ప్రకాశరావు, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.
అలాగే శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ నగరంలోని ప్రజాసదన్‌లో కేంద్ర మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి పాల్గొన్నారు.

లోతుగెడ్డ...
కొత్తూరు : మంత్రి రామ్మోహన్ నాయుడును, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయనతో పాటు గెడ్డవలస కమలాకర్, రేగేటి కన్నయ్యలు ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పని వద్దు... పాఠశాల ముద్దు

పొందూరు: బడిఈడు చిన్నారులు పనిలో వద్దు... పాఠశాలలే ముద్దు అంటూ మంగళవారం విద్యాశాఖ అధికారులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పొందూరు ఎంపిపి-1 పాఠశాలలో బడికి పోదాం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన తమ పిల్లలను తప్పనిసరిగా విద్యకోసం పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావు, సమగ్ర శిక్షా అభియాన్ ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ పి.జనార్ధనరావు, పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, బాలకార్మికశాఖ అధికారులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

24న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పోలాకి : ఈ నెల 24న ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లు ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. మోడల్ స్కూల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు గాని, నేరుగా మోడల్ స్కూల్‌కి వచ్చి పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే శంకర్ జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, టిడిపి కార్యకర్తలు, పలువురు అధికారుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తొలుత ఆయన కార్యాలయ ఆవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో రెడ్డి శంకర్ ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కార్యదర్శి చిట్టి నాగభూషణం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సర్ పైడిశెట్టి జయంతి, గార టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సంక్షిప్త వార్తలు

నీటితొట్టెలు ఏర్పాటు చేయాలి

నందిగాం : వేసవి, గ్రామ దేవత ఉత్సవాలు దృష్టికి గొర్రెలకు, మేకలకు అందుబాటులో నీటితొట్టెలు ఏర్పాటు చేయాలని ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలన సాంబమూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కోరారు. జిల్లాలో 40 వేల కటుంబాలు గొర్రెలపై, మేకలపైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎనిమిది లక్షల గొర్రెలు, నాలుగు లక్షల మేకలు జిల్లాలో ఉన్నాయని చెప్పారు. బంజర భూములు, కాలువ గట్లు, చెరువు గర్భాల్లో తుమ్మ చెట్లు మేతకు కేటాయించాలన్నారు. నట్టాల నివారణకు ఏడాదికి నాలుగుసార్లు ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాక్సినేషన్ చేయాలని కోరారు. ఎన్‌సిడిసి, నాబార్డు ద్వారా ఒక్కో గొర్రెల పెంపకందారుణకి రూ.3 లక్షలు చొప్పున రుణం అందించాలని కోరారు.

బాహుదా ఛానల్ శ్రమదానానికి తీర్మానం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని బాహుదా నదిలో ఉన్న బెల్లుపడా ఛానల్ మరమ్మతులు చేపట్టేందుకు శ్రమదానం చేయడానికి రైతులు తీర్మానం చేశారు. ఎల్లమ్మ గుడి వద్ద బాహుదా నదిపై ఆధారపడిన రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వచ్చిందని, ఈ సమయంలో బాహుదా ఛానల్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎందని అన్నారు. రైతులు చందాలు వేసుకుని శ్రమదానంతో పనులు చేయాలని నిర్ణయించామని అన్నారు. కార్యక్రమంలో ఆసి చిరంజీవిరెడ్డి, గిన్ని చిన్నారెడ్డి, పిలక యాదవరెడ్డి, అనపాన పీతాంబరరెడ్డి, బడ్డే దొరబాబురెడ్డి, కుర్మయ్యరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

పొందూరు: మండలంలోని కింతలిలో సర్వే నంబరు 48-17ఎ ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు ఫిర్యాదు చేశారు. 2013-2018 మధ్య కాలంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఈ స్థలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీంతో కొంతమేరకు పనులు చేపట్టామని తెలిపారు. కానీ, గ్రామానికి చెందిన ఎస్.నర్సిం అప్పారావు ఈ స్థలం నాది అంటూ పాస్‌బుక్ తీసుకు రాగా, అప్పటి తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తి అది ప్రభుత్వం స్థలమని హెచ్చరించి పాస్‌బుక్‌ను రద్దు చేశారని అన్నారు. అప్పట్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రానికి ఇంతవరకూ బిల్లు కూడా మంజూరు కాలేదని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు మరలా అదే వ్యక్తి ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని, దీనిని అడ్డుకోవాల్సిన స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణానికి కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని సంరక్షించాలని తహశీల్దార్‌ను కోరుతూ ఫిర్యాదు చేశారు.

సమన్వయంతో పనిచేద్దాం

నౌపడ : సచివాలయ సిబ్బంది కూటమి ప్రభుత్వ నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని నౌపడ టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి అన్నారు. నౌపడ 1,2 సచివాలయ సిబ్బంది ఆయనను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులందరూ ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, ఉమాపతి, సచివాలయ సిబ్బంది వి.వెంకటనారాయణ, గవరయ్య పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

పాతపట్నం: పాతపట్నంలోని బాలాజీ నగర్-2 వీధిలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని వైసిపి నాయకులు బి.నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ కె.సీతారామరాజును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీధిలో ఎత్తయిన ప్రాంతం కావడం తాగునీరు సరఫరా సక్రమంగా రావడం లేదని అన్నారు. ఇప్పటికే టెక్కలి డిపిఒ, పంచాయతీ ఇఒ, ఇఒపిఆర్‌డిల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. తాత్కాలిక పరిష్కారానికివాహనాల ద్వారానైనా తాగునీరు ఇప్పించాలని విన్నవించారు.

పుస్తకాల పేరుతో వ్యాపారం తగదు

పలాస : అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ శ్రీచైతన్య పాఠశాల వద్ద ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను తుంగలో తొక్కుతూ తరగతికి రూ.11 నుంచి రూ.15 వేలు వరకు పుస్తకాలతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, పలాస నియోజకవర్గ అధ్యక్షులు పవన్, జస్వంత్, జీవన్, సూర్య, ఆదర్శ్ పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

కోటబొమ్మాళి: ఏ ఉద్యోగికైనా ఆయన అందించిన సేవలే గుర్తింపునిస్తాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు జాన్ ఏడ్వర్డ్‌ను కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్, జలుమూరు చిన్నవాడులతో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా బాబ్జీమాస్టర్ ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సనపల కరుణ్‌కుమార్, బమ్మిడి శ్రీరాములు, జి.వి.రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసిరావు

ప్రాసిక్యూషన్ అనుమతిని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- పలాస
ఉపా కింద ప్రముఖ రచయిత అరుంధతి రాయ్‌ని ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్ట్‌నెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని వామపక్ష నాయకులు తామాడ సన్యాసిరావు, చాపర వేణుగోపాల్, నెయ్యల గణపతి, వంకల మాధవరావు తీవ్రంగా ఖండించారు. కాశీబుగ్గలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల క్రితం నాటి కేసులో ఢిల్లీ లెఫ్ట్‌నెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఇలా అనుమతి మంజూరు చేయడం దురుద్దేశంతో కూడిన చర్యగా భావిస్తున్నామన్నారు. ఉపా వంటి తీవ్రమైన సెక్షన్ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వడం ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని అణిచివేయాలని బిజెపి ప్రభుత్వం భావిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రతికార చర్యగా దీన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరూ పెద్ద ఎత్తున కదిలి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మళ్లీ దిగబడిన లారీలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
మండల ప్రధాన రహదారి అలికాం-బత్తిలి రహదారిపైన పోలీస్ స్టేషన్ సమీపంలోని గోతుల్లో రెండు లారీలు మంగళవారం దిగబడ్డాయి. దీంతో వాహనాలు గంటలకొద్దీ నిలిచిపోయాయి. మంగళవారం సాయంత్రం ఒడిశా వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న రెండు లారీలు రహదారిపైన ఉన్న గుంతల్లో దిగిపోవడంతో వాహనాలు వెళ్లేందుకు స్థలం లేకపోయింది. అటు ఒడిశా వైపు, ఇటు శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు ప్రధాన రహదారిపై గంటల సేపు నిలిచిపోయి. ఆర్‌టిసి, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు గంటల కొద్దీ చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ఇటీవల స్థానిక ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యాన గోతులను గ్రావెల్ తో పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షానికి మళ్లీ పెద్ద పెద్ద గోతులుగా తయారయ్యాయి. దీంతో మళ్లీ కష్టాలు మొదటికి వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసుల ప్రొక్లెయినర్ల సహాయంతో వాహనాలను బయటకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నిలిచిన వాహనాలు

పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలి

ఎమ్మెల్యే రవికుమార్‌తో టిడిపి నాయకులు

పొందూరు: టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలను, పార్టీ తీసుకున్న నిర్ణయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పార్టీ నాయకులకు, శ్రేణులకు సూచించారు. విజయవాడలోని రవికుమార్ గృహంలో టిడిపి మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడాన్ని పార్టీ శ్రేణుల ఆవేదనను ఆయనకు వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యకులు సిహెచ్.రామ్మోహన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, తోలాపి మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావు. వి.ఆర్.గూడెం సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు ఉన్నారు.

మంత్రి శ్రీనివాస్‌ను కలిసిన ఎమ్మెల్యే

మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

లావేరు : రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యాన కూటమి నాయకులు కలిశారు. విజయన గరంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో మంగళవారం కలిసి దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గ సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడ శ్రీనివాసరావు, పైడిభీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, లుకలాపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

శ్రీకాకుళం రూరల్ : విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్ : ప్రతి రైతుకూ వరి విత్తనాలను అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని సింగుపురం-3 ఆర్‌బికెలో మంగళవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. మండల ఎఒ ఎం.ఉషారాణి మాట్లాడుతూ 80 క్వింటాళ్లు వరి విత్తనాలు కావాలని రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి బగ్గు రజినీ, ఎఇఒ నాయుడు, భైరి మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు పాల్గొన్నారు.
కవిటి: మండలంలోని నెలవంక పంచాయతీలో టిడిపి నాయకులు మంగళవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకుడు పూడి సాయికుమార్ మాట్లాడుతూ నెలవంక పంచాయతీ పరిధిలో ఆర్‌జిఎల్ 2537 రకం 110 బస్తాలు, ఎంటియు 1318 రకం నాలుగు బస్తాలు, ఎంటియు 1064 రకం 3 బస్తాలు అందించినట్టు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ 150 కేజీలు, కట్టె జనుము విత్తనాలు వంద కేజీలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యుడు హరికృష్ణ బిసాయి, తట్ట హేమదాసు, దుక్క మన్మథరావు, లొట్ల బాలరాజు, దొండపాటి శ్రీను, డి.తులసయ్య, ఎం.మాధవరావు, ఎస్.ధనరాజు, ఎం.మధు పాల్గొన్నారు.
ఇచ్ఛాపురం : ఈదుపురం గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద వరి విత్తనాలను జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్, కార్యదర్శి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పంపిణీ చేశారు.
సోంపేట : రైతులంతా నారు మడులు వేసుకునే ముందు విత్తన శుద్ధిని తప్పనిసరిగా చేసుకోవాలని మండల ఎఒ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని కొర్లం, మాకన్నాపురం, సుంకిడి గ్రామాల్లో మంగళవారం చేపట్టిన విత్తనాల పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నారుమడులు వేసుకునే ముందు రైతులంతా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అప్పుడే పంటలను చీడపీడల నుంచి రక్షించుకోగలరన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి : విత్తనాలు అందజేస్తున్న నాయకులు

సరుబుజ్జిలి : విత్తనాలను పంపిణీ చేస్తున్న రాజారావు

సరుబుజ్జిలి : మండలంలో ఖరీఫ్ సాగుచేసే ప్రతి రైతుకూ సబ్సిడీ వరి విత్తనాలు ప్రభుత్వం అందిస్తుందని తెలుగు యువత మండల అధ్యక్షులు తాడేల రాజారావు అన్నారు. మండలంలోని రొట్టవలస రైతు భరోసా కేంద్రంలో మండల ఎఒ బొడ్డేపల్లి పద్మనాభం అధ్యక్షతన రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు తాడేల వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల రమణ పాల్గొన్నారు.
బూర్జ : మండలంలోని పెద్దపేట విత్తన అభివృద్ధి క్షేత్రంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ దుప్పాడ వెంకట అప్పలనాయుడు, మండల ఎఒ వి.రాజేశ్వర రావు, కె.కృష్ణ, మల్లేష్, ఎఇఒ జగదీష్ పాల్గొన్నారు.